క్లుప్తంగా

చిల్లకర్ర వేలం వాయిదా



వరికుంటపాడు: వేంపాడు చెరువులోని చిల్లకర్ర వేలంపాట వాయిదా పడింది. చెరువులోని చిల్లకర్ర కొట్టేందుకు పంచాయతీ తీర్మానంతో ఇరిగేషన్ అధికారుల అనుమతితో డీఎల్‌పీఓ ఉత్తర్వుల మేరకు గ్రామసచివాలయంలో సోమవారం వేలం పాట నిర్వహించారు. చెరువు మొత్తం 62 ఎకరాల విస్తీర్ణం ఉండగా, కేవలం ఐదు ఎకరాలకే వేలం నిర్వహిస్తున్నట్లు అధికారులు నోటీసుబోర్డులో పొందుపరిచారు. ఈ విషయాన్ని గమనించిన పాటదారులు అధికారులను నిలదీయడంతో వివాదం చోటుచేసుకుంది. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. ఫలితంగా పాటదారులు వెనుదిరిగారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన పాల వ్యాన్



సంగం: మండలంలోని ర్యాంపు సమీపంలో సోమవారం వేకువన పాల వ్యాన్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న పాల వ్యాన్ డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా అదుపు తప్పి పొలాల్లో దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

గుర్రప్పస్వామికి ప్రత్యేక పూజలు



వింజమూరు: పట్టణంలోని గుర్రప్పస్వామి, అంకాళమ్మ, నాగార్పమ్మ దేవస్థానాల్లో సోమవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌లకు జలాభిషేకం నిర్వహించారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ఉదయగిరి డిపోకు రూ.4.16లక్షల రాబడి

ఉదయగిరి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపోకు ప్రత్యేక బస్ సర్వీసుల ద్వారా రూ.4.16 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి డీఎం షేక్ కరీమున్నీసా సోమవారం తెలిపారు. డిపో పరిధిలోని శైవ క్షేత్రాలకు ఈ నెల 18,19 తేదీల్లో 22 ప్రత్యేక సర్వీసులను 9,527 కిలోమీటర్లు నడపడం ద్వారా ఈ ఆదాయం వచ్చిందని వివరించారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

మర్రిపాడు: మండలంలోని ఈర్లపాడు సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11 కోళ్లు, నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లతో పాటు రూ.2,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు వారు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల తనిఖీ

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు, తూర్పుబోయమడుగుల రైతుభరోసా కేంద్రాలను మండల వ్యవసాయాధికారి జీ కిరణ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వీఏఏలకు సూచనలు, సలహాలు అందజేశారు. పంట నమోదు, ఈకేవైసీని నూరు శాతం పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కియోస్క్ యంత్రం వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించాలన్నారు.

హఫీజ్‌పాషాకు వక్ఫ్‌బోర్డు నోటీసులు

ఆత్మకూరు: ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతిగా వ్యవహరించిన హఫీజ్‌పాషాపై పలు ఆరోపణలు రావడంతో వక్ఫ్‌బోర్డు తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 23న విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో సీఈఓ ఖాదర్‌బాషా నిర్వహించే విచారణకు హాజరుకావాలని హఫీజ్‌పాషాకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీలను హఫీజ్‌పాషా కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్ మహమ్మద్ హుస్సేన్‌బాషా సోమవారం తెలిపారు. వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాదర్‌బాషాతో పాటు ముఖ్యకమిటీ సభ్యులు విచారణ చేయనున్నారని ఆయన వివరించారు.

ధాన్యం రైతు ధరహాసం

ఈ ఏడాది రబీ పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ధాన్యానికి గిరాకీ ఉండడంతో ధరలు బాగున్నాయి. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టడంతో మిల్లర్లు నేరుగా రైతుల వద్దకొస్తున్నారు. క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోత దశలోని వరి పైరు

ఉదయగిరి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో కరువుతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వరుణుడు కరుణిస్తుండడంతో గత మూడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 8.5 లక్షల ఎకరాలకుపైగా వరి సాగు చేపడుతుండగా, ఉదయగిరి,కావలి,ఆత్మకూరు నియోజవర్గాల పరిధిలో సుమారు 2.5 లక్షల ఎకరాల్లో సాగవుతున్నట్లు అంచనా. గతేడాది వర్షాలు విస్తారంగా పడడంతో రబీలోనూ అదేస్థాయిలో సాగుచేపట్టారు. ప్రధానంగా నెల్లూరు సన్నాలు, షుగరులెస్, ఎంటీయు 1010, జిలకర మసూర రకాలు సాగు చేశారు.

ఆశాజనకంగా దిగుబడులు–ధరలు

జిల్లాలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కొన్ని మండలాల్లో వరి కోతలు ప్రారంభమవగా, మరో వారం రోజుల్లో మిగిలిన మండలాల్లో వరి కోతలు మొదలు కానున్నాయి. రబీలో నాట్లు సకాలంలో వేయడంతో దిగుబడులు సైతం ఆశాజనకంగా వస్తున్నాయి. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవడంతో వ్యాపారులు పోటీపడి కళ్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ధాన్యానికి మంచి ధరలు లభిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లల్లో అక్రమాలకు పాల్పడ్డారు. సిండికేట్‌గా మారి ధరలు బాగా తగ్గించడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ఎక్కువగా ధాన్యం కొనుగోలు చేసింది. అయితే సివిల్ సప్లయిస్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులతీరుతో నగదు చెల్లింపుల్లో కొంత జాప్యం జరిగింది. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు సైతం రైతులను ఇబ్బంది పెట్టారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ప్రభుత్వం ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంది. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు పక్కాప్రణాళికలు రూపొందించింది. దీంతో మిల్లర్లు నేరుగా రైతుల వద్దకొచ్చి కొనుగోలు చేస్తున్నారు. దళారుల ప్రమేయం చాలా వరకు తగ్గడంతో ధరలు బాగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. జిలకర మసూర పుట్టి రూ.20 వేల నుంచి రూ.22వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. షుగర్‌లెస్ పుట్టి రూ.23 వేల వరకు, నెల్లూరు సన్నాలు, ఎంటీయూ 1010 రకాలను రూ.17 వేల నుంచి 18 వేల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. దిగుబడులు కూడా బాగా ఉండడంతో రైతులకు పెట్టుబడులు పోను నాలుగు రూపాయలు చేతికందుతున్నాయి. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన నెల రోజులకు రైతులకు నగదు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు బాగున్నాయి



ఈ ఏడాది రబీ పంట దిగుబడులు పెరిగాయి. ఎకరాకు నాలుగు పుట్ల కుపైగా దిగుబడులు వస్తున్నాయి. ఈ ఏడాది ధాన్యం ధరలు బాగున్నాయి. ధాన్యానికి గిరాకీ ఉండి కోసిన వెంటనే వ్యాపారులు చేతిలో నగదు పెట్టి తీసుకెళ్లడంతో పెట్టుబడులు పోనూ నాలుగు రూపాయలు చేతికి వచ్చాయి.

– మాధవరెడ్డి ,రైతు

కమనీయం..రమణీయం



చేజర్ల: కోటితీర్థంలో విశేషాలంకారంలో శివపార్వతులు



జలదంకి: శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చేజర్ల: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా కోటితీర్థంలోని కోటేశ్వరాలయంలో ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆదిదంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సోమవారం ఉదయం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

జలదంకి: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా జలదంకిలోని గంగాపార్వతీ సమేత జానకీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని సోమవారం ఉదయం నేత్రపర్వంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చేవూరు జనార్దన్‌రెడ్డి–సులోచనమ్మ దంపతులు మేళతాళాల నడుమ పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవం, రాత్రి అశ్వవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తగా ఆలయ చైర్మన్ వాకా శ్రీనివాసులరెడ్డి వ్యవహరించారు. వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నాయకులు గుర్రం జగ్గయ్య నాయుడు, వర్థినేని మురళి, పులిం బాబుల్‌రెడ్డి, అన్నారెడ్డి చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గ్రిగ్ పోటీల్లో తెల్లపాడు విద్యార్థుల సత్తా

కలిగిరి: వింజమూరులో జరిగిన ఉదయగిరి నియోజకవర్గస్థాయి గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో తెల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్‌ఎం నందా వెంగయ్య తెలిపారు. సీనియర్ బాలికల విభాగంలో 800 మీటర్ల పరుగులో ఒంటేరు వర్ష ప్రథమ, కొప్పోలు నవ్య తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. దామెర మోహన 200 మీటర్ల పరుగు, డిస్కస్త్రోలో ప్రథమస్థానంలో నిలిచిందని తెలిపారు. చేబ్రోలు సాయి 100 మీటర్ల పరుగులో ప్రథమ, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. బాలుర సీనియర్ విభాగంలో లింగాలదిన్నె మదన్ 1500 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, వేములపాటి అనిల్ డిస్కస్‌త్రోలో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. జూనియర్ బాలబాలికల విభాగాల్లో యాగసిరి లక్ష్మీప్రసన్న లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానం, బండారు రాజశేఖర్ 200 మీటర్లు, 100 మీటర్ల పరుగులో తృతీయ స్థానం సాధించారని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను హెచ్‌ఎంతో పాటు పీఈటీ తిరుపాలురెడ్డి, ఉపాధ్యాయులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గౌతమ్‌రెడ్డి సంస్మరణ సభ ఏర్పాట్లపై సమీక్ష

ఆత్మకూరురూరల్: బ్రాహ్మణపల్లిలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు మండల నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి సంస్మరణ సభ ఏర్పాట్లపై సమీక్షించారు. ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గౌతమ్‌రెడ్డి అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరయ్యేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, ధనాల రమేష్, బొలిగర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జలదంకి: మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ బాబు సోమవారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

24న మండల సర్వసభ్య సమావేశం

వింజమూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఉదయగిరి స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈ నెల 25న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ సోమవారం తెలిపారు. ఎంపీపీ మూలే పద్మజ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్‌కు లోబడి జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

85 మందికి వైద్యపరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని దక్కునూరు, జీ కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించారు. 104 వాహనం ద్వారా వైద్యులు ఆయేషా, కరీష్మా 85 మందికి వైద్య సేవలు అందించారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్‌ఎంలు సురేఖ,ఫరీదా, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యాలను పెంపొందించాలి



ఉదయగిరి: రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి



ఆత్మకూరు: రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న ఎంఈఓ షేక్ నజీర్‌బాషా

ఉదయగిరి: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను ఉపాధ్యాయులు పెంపొందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్ వలి సూచించారు. పట్టణంలోని షబ్బీర్‌కాలనీ, యాదవపాళెం ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల పఠనా సామర్థ్యాలు, నైపుణ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వర్క్‌బుక్‌లు పూర్తిచేసేలా హెచ్‌ఎంలు శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిచయం చేస్తూ నాణ్యమైన గుణాత్మక విద్యను బోధించాలన్నారు. అనంతరం రిజిష్టర్లను తనిఖీ చేశారు.

ఎంఈఓ తనిఖీలు

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేట, నాగులపాడు, చెర్లోయడవల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈఓ షేక్ నజీర్‌బాషా సోమవారం తనిఖీ చేశారు. పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యం, జగనన్న గోరుముద్ద అమలు తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

న్యాయమూర్తికి సన్మానం

కావలి: కావలి అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎల్ అన్నపూర్ణశ్రీ విజయవాడ ఐదో మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి అన్నపూర్ణశ్రీని సోమవారం ఘనంగా సత్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి శోభ, స్పెషల్ మేజిస్ట్రేట్ పరశురామ్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా అన్నపూర్ణశ్రీ కేసుల పరిష్కారంలో చూపిన చొరవను అభినందించారు. కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రిషికుమార్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, సూర్యనారాయణ, కోశాధికారి శ్రీదేవి, సీనియర్ న్యాయవాదులు పోట్లూరి శ్రీనివాసులు, రాజేంద్ర, వరప్రసాద్, కెనడీ, జగన్‌మోహన్‌రావు, పువ్వాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి అన్నపూర్ణశ్రీని సత్కరిస్తున్న న్యాయవాదులు

దళితద్రోహిని కఠినంగా శిక్షించాలి

అల్లూరు: దళిత ద్రోహి తెలంగాణకు చెందిన అమర ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని మండల అంబేద్కర్ యువజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బోర్డ్ స్కూల్ ఆవరణలో అంబేద్కర్ యువజన సంఘ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘ నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ బతికి ఉంటే తాను తుపాకీతో కాల్చి చంపేవాడినని ప్రగల్భాలు పలికిన అమర ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రసాద్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎల్లు సాల్మన్‌రాజు, పొంగులూరి ప్రసాద్, పీ శ్రీనివాసులు, పీ సుధాకర్, దానం మాల్యాద్రి, ముసలి నరేంద్ర, కే శ్రీనివాసులు, రమణయ్య పాల్గొన్నారు.

26న మిస్ సింహపురి ఆడిషన్స్

నెల్లూరు(బృందావనం): మిస్ సింహపురి ఆడిషన్స్‌ను ఈ నెల 26న నిర్వహించనున్నారని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో స్టార్ ఈవెంట్స్ ఆర్గనైజర్ రాజుతో కలిసి సోమవారం ఆవిష్కరించిన అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడారు. నగరంలోని తేజస్విని గ్రాండ్ హోటల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. అనంతరం రాజు మాట్లాడారు. 16 నుంచి 25 ఏళ్లలోపు యువతులు పాల్గొనవచ్చని చెప్పారు. ఎంపికైన వారికి మార్చి 26న గ్రాండ్ ఫైనల్స్‌ను నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు 81252 72860 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

ఆత్మకూరు: భారత రాజ్యాంగం ప్రకారం చట్టం అందరికీ ఒక్కటేనని, చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమేనని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి పాఠశాల ఆవరణలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందిస్తుందని తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం వెంకటేశ్వర్లు, ఎల్‌వీ రమణయ్య, ఎస్సై రాజేష్, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను పూర్తి చేయాలి

ఉదయగిరి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయం నుంచి మండలంలోని ఆరోగ్యకార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణా కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలో 218 మంది గర్భిణులు ఉండగా, ఇప్పటి వరకు 129 మంది, 5 ఏళ్లలోపు చిన్నారులు 1,726 మంది ఉండగా, 250 మంది, 6 నుంచి 19ఏళ్లలోపు వారు 833 మంది ఉండగా, 325 మందిని సర్వేచేసి వివరాలు సేకరించారని తెలిపారు. మిగిలిన వారి వివరాలను సేకరించి నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ఈఓపీఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో వ్యవహరిస్తున్నా

- వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం

ఆత్మకూరు: ఆనం కుటుంబానికి 90 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని, తాను గత నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవహరిస్తున్నానని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన మైనార్టీ నాయకుడు సర్దార్ కుమారుడి వివాహానికి హాజరైన ఆనం స్థానిక నాయకులతో ముచ్చటించారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలపై పలువురు ప్రశ్నించగా, వెంకటగిరిలో రాజ్యాంగేతర శక్తులు పరిపాలన చేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని పేర్కొన్నారు. గతంలో ఆయన ఆత్మకూరు ఇన్‌చార్జిగా వ్యవహరించిన విషయాన్ని ప్రశ్నించగా, తాను అధికారులతో ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని, కేవలం పార్టీ నాయకులతోనే సమావేశాలు నిర్వహించానని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల అనంతరం రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

విద్యార్థుల అల్పాహారానికి నగదు విరాళం

ఉదయగిరి: గండిపాళెంలోని గుంటుపల్లి కొండయ్యచౌదరి–సుబ్బమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థుల అల్పాహారానికి జీఎంకే ట్రస్ట్ చైర్మన్ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.15వేలు విరాళం ప్రకటించారు. ట్రస్ట్ ప్రతినిధి బీ వెంకటేశ్వర్లు ద్వారా హెచ్‌ఎం ఎం వెంకటేశ్వర్లుకు సోమవారం నగదు అందజేశారు. పురోగామి కార్యక్రమంలో భాగంగా సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పది విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని కోరారు. స్థానికులు షేక్.గఫూర్, రాపల్లి.శ్రీనివాసులు,ఉపాధ్యాయులు మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న జీఎంకే ట్రస్ట్ ప్రతినిధి వెంకటేశ్వర్లు